క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా బుధవారం అస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంతరావు తెలిపారు.

- ఉ. 9 నుంచి మ. 12 గంటల వరకు... అక్బర్‌బాగ్, ఆర్యసమాజ్, ఈద్గా, స్టాండ్లీ స్కూల్, ఫైర్ స్టేషన్, దిల్‌కుషా ఫంక్షన్‌హాల్, ఉజాలేషా దర్గా, విష్ణు అపార్ట్‌మెంట్, సాయిదీప్ అపార్ట్‌మెంట్, సీ బ్లాక్ క్వార్టర్స్, అక్బర్‌బాగ్ క్రాస్‌రోడ్స్ పరిసర ప్రాంతాలు
- మ. 12 నుంచి ఒంటి గంట వరకు.. ఎంసీ కాలనీ, రామాలయం, ఎస్‌బీహెచ్ కాలనీ, అస్మాన్‌ఘడ్ వాటర్‌వర్క్స్, ఆర్‌బీ కాలనీ, ముంతాజ్ కాలేజీ, మలక్‌పేట పీఎస్, మహిళా మండలి, బీ బ్లాక్, హమాలీ బస్తీ, వెంకటాద్రి నగర్ పరిసర ప్రాంతాలు
- మ. 3 నుంచి సా. 5 గంటల వరకు... ఏకలవ్యనగర్, జాకీర్ హుస్సేన్ కాలనీ, సైదాబాద్ మెయిన్‌రోడ్, మాదన్నపేట మండి, గుడ్డిబౌలి పరిసర ప్రాంతాలు

ఘనంగా బోనాలు


కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సామనగర్‌లో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్‌ను సన్మానించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో తొట్టెల ఊరేగింపు


పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: శ్రావణ మాస బోనాల సందర్భంగా కొత్తపేట డివిజన్ శివ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, బీఆర్ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడె లింగాల రాహుల్ గౌడ్, బాబు, సుధీర్, సత్యనారాయణ, కన్నా గౌడ్, నరేష్ గుప్తా, వీరేందర్, లోకేష్ గుప్తా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వనస్థలిపురం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, విధిగా మొక్కలు నాటాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని భూలక్ష్మీనగర్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత కాలనీవాసులు తీసుకోవాలని సూచించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, కాశీపతి, మాధవరెడ్డి, వెంకటరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ సమస్య పరిష్కార చర్యలపై హర్షం

చాదర్‌ఘాట్: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ పీఆర్‌సీ సమస్య పరిష్కారంపై మంత్రి కొప్పుల చొరవ చూపడంపై తెలంగాణ వికలాంగుల కోపరేటివ్ కార్పొరేషన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మలక్‌పేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 7న నిర్వహించిన సమావేశంలో తమ సమస్య పరిష్కారానికి మంత్రి కొప్పుల ఈశ్వర్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రాములు, అధ్యక్షుడు ఎస్ఎన్ చారి, సలహాదారు వెంకటేశ్వరరావు, రవీందర్, సయ్యద్ యాదుల్లా, అంజయ్య పాల్గొన్నారు.

'బీపీ మండల్ నివేదికను అమలు చేయాలి'

హస్తినాపురం: బీపీ మండల్ నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లోని హస్తినాపురం డివిజన్ పరిధిలోని కస్తూరికాలనీలో వెంకట్‌యాదవ్ ఆధ్వర్యంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశవ్యాప్త జనగణనలో భాగంగా కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలుపర్చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. విద్యావేదిక ప్రతినిధులు నారగోని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి, పట్టుదల అవసరం

– రాంరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డైరెక్టర్


కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

చైతన్యపురి: జీవితంలో ఉన్నత శిఖరాల అధిరోహణకు, లక్ష్య సాధనకు కృషి, పట్టుదల అవసరమని రాంకీ ఫౌండేషన్ డైరెక్టర్ రాంరెడ్డి అన్నారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ గ్రీన్ లాండ్స్, రాంకీ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఫాణీనీయ డెంటల్ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్స్ అచీవర్స్–2023 పేరుతో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఇటీవల విడుదలైన ఎస్ఐ పోటీ పరీక్షలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైన అభ్యర్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగం సాధించిన 52 మంది అభ్యర్థులంతా జీవితంలో నలుగురికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలన్నారు. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు సాధించేలా చేసిన పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, శ్యాం ఇనిస్టిట్యూట్ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గ్రీన్‌లాండ్ అధ్యక్షుడు రూపారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, సభ్యులు లక్ష్మీకుమారి, విద్యాభూష్, అంబర్‌పేట, మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ మధుకర్ స్వామి, పీసీఎఫ్ జనరల్ సెక్రటరీ సందీప్ హరి, గద్దె భాస్కర్, ప్రేమ్‌కుమార్, ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా శిక్షణ



నాది జయశంకర్ భూపాలపల్లి జిల్లా జూకల్ గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. ఎలాగైనా పోలీస్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో శిక్షణ తీసుకున్నా. ఉద్యోగ సాధనలో నాకు సహకరించిన పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ గ్రీన్ లాండ్స్, రాంకీ ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు. 2018లో కానిస్టేబుల్ ఉద్యోగానికి సెలక్ట్ అయినా వెళ్లకుండా ఎస్ఐ పరీక్షకు శిక్షణ తీసుకున్నాన. స్టేట్ ఐదు ర్యాంక్‌ల్లో స్థానం సంపాదించా. ఇందుకు నా తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారు. ఎస్ఐ ట్రైనింగ్ పూర్తయ్యాక గ్రూప్స్‌కు ప్రిపేర్ అవ్వాలనుకుంటున్నా.

– నరేష్ బుస్సా

గ్రామానికే ఆదర్శంగా..



నాది ఖమ్మం జిల్లా కాకరవాయి గ్రామం. మా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారు. బీటెక్ పూర్తి చేసి ఎస్ఐ పోటీ పరీక్షకు 18 నెలల శిక్షణ తీసుకున్నా. రాష్ట్రవ్యాప్తంగా మంచి ర్యాంకు సాధించా. మా గ్రామంలో మొట్టమొదటి సారి ఎస్ఐ ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలవబోతున్నా. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సహకారంతో శామీర్‌పేటలోని శ్యాం పోలీస్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నా. నేను పోలీస్ ఉద్యోగం సాధించటంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. భవిష్యత్‌లో గ్రూప్–1 సెలెక్ట్ కావటమే లక్ష్యంగా పెట్టుకున్నా.

–ఉమ కొత్తపల్లి

ఎల్బీనగర్‌ను అభివృద్ధిలో రోల్‌మోడల్ చేస్తా: ఎమ్మెల్యే


నాగోలులో అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణా సురేంద్రనాథ్

నాగోలు: శివారు కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగోలు డివిజన్‌లోని వివిధ కాలనీల్లో రూ 6.79 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. శ్రీనివాస్ ఎవెన్యూ కాలనీలో సీసీ రోడ్డు పనులకు, అరుణోదయ కాలనీ రోడ్డు వెడల్పు, నాగోలు హరిజన బస్తీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అలాగే, గ్రీన్ ఫీల్డ్, అనంతుల జంగారెడ్డి, నర్సింహస్వామి, నరసింహస్వామి, హరిపురి, సాయిరాం హిల్స్ కాలనీల్లో సీసీ రోడ్డు పనులను, బ్లైండ్స్ కాలనీలోని దివ్యాంగుల కళాభవన్ కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ పనులను ప్రారంభించారు. సర్వే నంబర్ 58లో, గోపాల కృష్ణపురం కాలనీలో సీసీరోడ్డు పనులకు, వాంబే కాలనీ యాదవ సంఘం గ్రేవీ యార్డు ఆధునీకరణ, ఇంద్రప్రస్థా కాలనీ, బాలాజీ నగర్‌ల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. నాగోలు డివిజన్‌లో ఆనంద్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ దృష్టిలో పెట్టుకుని ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. నాగోలు మహాంకాళి ఆలయం వద్ద వన్‌వేను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, నాగోలు డివిజన్ పార్టీ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, ప్రమీల, రమేష్, జగదీష్ యాదవ్, తూర్పాటి కృష్ణ, శ్యామ్‌సుందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు డప్పు రాజు, రాఘవచారి పాల్గొన్నారు.

'అవయవదానం చేయండి.. మరణం తర్వాత జీవించండి'


మాట్లాడుతున్న అసోసియేషన్ కార్యదర్శి గురుప్రకాశ్

మలక్‌పేట: అవయవదానం చేయండి.. మరణం తరువాత కూడా జీవించండి అని తెలంగాణ స్టేట్ బాడీ అండ్ ఆర్గాన్ డోనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గురుప్రకాశ్ పిలుపు నిచ్చారు. అవయవదాన వారోత్సవాలను పురస్కరించుకుని రిటైర్డ్ పారామెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ సాయి డిగ్రీ, పీజీ కాలేజీలో విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన వ్యక్తి నుంచి లివర్, కిడ్నీ, బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి లివర్, కిడ్నీ, ఊపిరితిత్తులు, కళ్లు, గుండె, చర్మాన్ని తీసి అవసరమైన వారికి అమర్చవచ్చన్నారు. చనిపోయిన ఆరు గంటల వరకు కళ్లను దానం చేయవచ్చన్నారు. రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్, సద్గుణాచారి మాట్లాడుతూ, చనిపోయిన తర్వాత కాల్చడమో, లేక పూడ్చి పెట్టడానికి బదులు కొన్ని అవయవాలను అవసరమున్న తోటి మానవులకు దానం చేసి ప్రాణభిక్ష పెట్టొచ్చన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి, డాక్టర్ పి. అంజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రేడియో టవర్ ఎక్కేందుకు కానిస్టేబుల్ అభ్యర్థుల యత్నం

అడ్డుకొని అరెస్టు చేసి పోలీసులు

హస్తినాపురం: జీఓ 46కు వ్యతిరేకంగా కానిస్టేబుల్ అభ్యర్థులు వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్‌కుంటలో గల రేడియో స్టేషన్ టవర్ ఎక్కి నిరసన తెలిపేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వనస్థలిపురం సీఐ దేప జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్న సమయంలో ఎనిమిది మంది పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు రేడియో స్టేషన్ టవర్ ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సీఐ తమ సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. బనావత్ నవీన్, భాక్యాకిష్ట, బాక్యాలక్ష్మన్, చిపిరి శివకుమార్, అన్మపూసలు, ధర్మపురి నాగచారిలతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతరులు రేడియో టవర్ ఎక్కకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని స్టేషన్ మేనేజర్‌కు నోటీసులు ఇచ్చామని సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

మలక్‌పేట: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది.ఎస్సై జయంత్ కథనం ప్రకారం.. అస్మాన్‌ఘడ్ పరిధిలోని వెంకటాద్రినగర్‌లో మహారాష్ట్ర నుంచి జీవనోపాధికి వలస వచ్చిన నారాయణ సింగ్ గౌర్(90) కుటుంబం నివాసం ఉంటోంది. ఇతడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె సురేఖ వద్ద ఉంటున్న నారాయణ సింగ్ గౌర్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇదిలా ఉండగా, సోమవారం సాయంత్రం ఇంటిని బయటికి వెళ్లిన నారాయణ సింగ్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం పరిసరాల్లో వెదికినా ప్రయోజనం లేదు. దీంతో స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఇంటి వెనుకు వెళ్లినట్లు కనిపించింది. అటుగా వెళ్లి చూడగా సమీపంలో ఉన్న బావిలో మృతదేహం కన్పించింది. సమాచారం అందుకున్న ఎస్సై జయంత్ ఘటనా స్థలానికి క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. డీఆర్ఎఫ్ బృందం మృతదేహాన్ని బావి నుంచి బయటికి తీయగా ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సైదాబాద్: సకలాభీష్ట సిద్ధి కోసం శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరించడం మన సాంప్రదాయమని ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ వేంకటేశ్వర ఆలయం చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి అన్నారు. ఆలయ ప్రాంగణంలోని భక్తసమాజంలో ఈనెల 18న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఆయన ఆలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ముందస్తుగా పేర్లు నమోదు చేయించుకున్న మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో ప్రత్యక్షంగా లేదా సోషల్ మీడియా ద్వారా పరోక్షంగా పాల్గొనవచ్చన్నారు. వ్రతం అనంతరం వారికి ఆలయ కమిటీ అమ్మవారి చిత్రపటం, రూపు, పసుపు, కుంకుమ, వస్త్రం, అక్షింతలు అందజేస్తుందన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నం. 9849757708లో సంప్రదించవచ్చన్నారు.

యూనానీ వైద్య శిబిరానికి స్పందన

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని శ్రీరామాలయం–శివాలయం ప్రాంగణంలో మంగళవారం ఉచిత యూనానీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఆలయ చైర్మన్ ముద్దగౌని యాదయ్య, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య జాగ్రత్తలు వివరించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వైద్యులు ఝాన్సీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటుహక్కు విలువ తెలుసుకోవాలి

సైదాబాద్: నేటి యువత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న ఓటుహక్కు విలువను తప్పనిసరిగా తెలుసుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. మంగళవారం ఐఎస్‌సదన్‌లో ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన అందరూ తమ పేర్లను తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జీహెచ్ఎంసీ, ఎన్నికల కమిషన్ వారు ఏర్పాటు చేస్తున్న ఓటరు నమోదు కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఓటు ఉన్న వారు తమ ఓటరు కార్డులో ఏమైనా మార్పులు, చేర్పులు కావాలంటే చేసుకోవచ్చన్నారు.

శ్రావణమాస వాయినాల సమర్పణ

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సచివాలయనగర్‌లోని కన్యక పరమేశ్వరి ఆలయంలో అధిక శ్రావణ మాసం సందర్భంగా 33 రకాల పండ్లు, పూలతో 300 మంది మహిళలు మంగళవారం వాయినాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్నగౌడ్ పాల్గొని పూజలు చేసి మహిళలకు పసుపు, కుంకుమ బొట్టు అందజేశారు. ఆలయ చైర్మన్ వేముల జయరాములు, నాయకులు వెంకటస్వామి, రవికుమార్, భాస్కర్, ఆనంద్, చంద్రమౌళి, లక్ష్మీ, రాజ్యలక్ష్మి, బుచ్చన్న, రమాదేవి, శశికళ, అనిత పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న లక్ష్మీప్రసన్నగౌడ్

సీసీ రోడ్లు మంజూరు చేయాలని జెడ్సీకి వినతి


జెడ్సీ పంకజకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్ కుమార్

నాగోలు: నగరంలో కురిసిన భారీ వర్షాలకు కొత్తపేట డివిజన్‌లోని రహదారులన్నీ కొట్టుకుపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, వెంటనే నూతన సీసీరోడ్లు మంజూరు చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజను కోరారు. మంగళవారం ఆయన జెడ్సీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కొత్తపేట డివిజన్ సత్యానగర్ కాలనీలో రోడ్లు వర్షానికి కొట్టుకుపోయి మొత్తం బురద, గుంతలమయంగా మారి ప్రజలు కనీసం నడిచివెళ్లేందుకు కూడా వీలుపడని విధంగా మారిందన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. శ్రీ రామ లింగేశ్వర కాలనీలో కూడా ఇదే పరిస్థితి ఉందని ఇక్కడ కూడా వెంటనే రోడ్లు వేయాలని కోరారు. శివమ్మనగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, కమ్యూనిటీహాల్ మంజూరు చేయాలని, సత్యానగర్ జనప్రియ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న చెత్త డంపింగ్ పాయింట్ తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి పైప్‌లైన్లు ఆధునీకరిస్తాం


పైప్‌లైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లోని తాగునీటి పైప్‌లైన్లను దశలవారీగా ఆధునీకరిస్తామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీలో నిర్మిస్తున్న నూతన తాగునీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తాము పర్యటించినప్పుడు ఆయా ప్రాంతాల వారు తాగునీటి సమస్య గురించి తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన పైప్‌లైన్లు పలుచోట్ల లీకేజీలకు కారణమవుతున్నాయన్నారు. అందుకని డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్తవి వేయడంతో పాటు అవసరమైన చోట నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేయిస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డిప్యూటీ మేనేజర్ మినాజ్ పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల విజేతలకు సర్టిఫికెట్ల అందజేత



చైతన్యపురి: తెలంగాణ ప్రాంత సంస్కార భారతి, దిల్‌సుఖ్‌నగర్ గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జూనియర్స్, సబ్ జూనియర్స్‌కు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు భవాని మహిళా మండలి అధ్యక్షురాలు శేషుకుమారి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. జడ్జీలుగా శ్రావని, నవిత వ్యవహరించారని గాయత్రి డ్యాన్స్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సంస్కారభారతి తెలంగాణ ప్రాంత కార్యదర్శి శివాజీ, పలువురు చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వెంటనే స్పందిస్తున్న సీఎం

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి


బధిరుల కళాశాల పరిశీలన బృందంతో చర్చిస్తున్న వాసుదేవరెడ్డి

చాదర్‌ఘాట్: తన దృష్టికి వచ్చి దివ్యాంగుల సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే స్పందించి పరిష్కారానికి ఆదేశాలు ఇస్తున్నారని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి అన్నారు. బధిరులకు డిగ్రీ కళాశాల లేకపోవడంతో వారు ఉన్నత విద్యకు దూరమై ఉపాధి అవకాశాలు పొందలేక పోతున్నారని ఇటీవల తాను సీఎం దృష్టికి తీసుకెళ్లానని ఆయన తెలిపారు. అందుకు వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ భవన్‌లో బధిరులకు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిశీలన బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. మంగళవారం ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్ ఆధ్వర్యంలోని పరిశీలన దివ్యాంగుల సంక్షేమ భవన్‌కు వచ్చింది. ఈ బృందంతో వాసుదేవరెడ్డి తన కార్యాలయంలో చర్చలు జరిపారు. పరిశీలన బృందం నివేదిక పంపిన తర్వాత కళాశాల ఏర్పాటు సుగమం అవుతుందని వాసుదేవరెడ్డి తెలిపారు.

ఈవీఎం, వీవీప్యాట్లపై అవగాహన కలిగి ఉండాలి


ఈవీఎంలు, వీవీప్యాట్లపై అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

నాగోలు: ఈవీఎంలు, వీవీప్యాట్లు ఉపయోగించే పద్ధతిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారి ఎం. విక్రాంత్‌రెడ్డి సూచించారు. కొత్తపేట డివిజన్ న్యూనాగోలు సీనియర్ సిటిజన్ ఫోరమ్‌లో మంగళవారం ఈవీఎంలు, వీవీప్యాట్లు ఉపయోగించే పద్ధతిపై అగాహన కల్పించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటు వేసేటప్పుడు బటన్ నొక్కే విధానం, ఓటు వేసిన తర్వాత ఆ ఓటు మనం వేసిన వ్యక్తికే పడిందా లేదా అనేది వీవీపాడ్‌లో ఎలా చూడవచ్చు వంటి అంశాలను తెలియజేశారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు పనిచేసే విధానాన్ని సభ్యులకు డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్స్ సహదేవ్, సైదులు, న్యూనాగోల్ సీనియర్ సిటిజెన్ ఫోరమ్ అధ్యక్షుడు కొమరాజు జ్ఞానకుమార్, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీ తిమ్మారెడ్డి, యశ్వంత్ రావు, పరశురామ్, ఆశాలత, సీతారామ రాజు, సంజీవ రాణి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందడం లేదు: సామ


కార్యక్రమంలో పాల్గొన్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: తెలంగాణలో నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందడం లేదని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం గడ్డిఅన్నారం డివిజన్‌లోని త్యాగరాయనగర్ కాలనీలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో ప్రజలకు అందుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరితమైన పాలన అందిస్తుందని, సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలు, ఎమ్మెల్యే అనుచరులకు మాత్రమే అందుతున్నాయని రంగారెడ్డి విమర్శించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు ఆనంద్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, శ్రవణ్‌గౌడ్, రాంరెడ్డి, లక్ష్మీదేవి, రాజ్యలక్ష్మి, వెంకటేష్‌యాదవ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్


పార్టీ ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న విశారదన్ మహరాజు

దిల్‌సుఖ్‌నగర్: ఉమ్మడి హైదరాబాద్ జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో ఎన్నికల బరిలో ఉంటామని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర (డీఎస్‌పీ) అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని కొత్తపేట బాబూ జగ్జీవన్ భవన్‌లో జరిగిన ఉమ్మడి హైదరాబాద్ మేడ్చల్ రంగారెడ్డి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. హైదరాబాద్ మహానగరాన్ని బీసీ, ఎస్సీ ఎస్టీలే తమ రక్తమాంసాలతో కట్టారని, అందుకే వాళ్లకు అధికారాన్ని కట్టబెట్టేందుకు ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. ఈ సందర్భంగా చాంద్రాయణ గుట్ట అసెంబ్లీ నియోజకవర్గానికి ధర్మసమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అబ్దుల్ రెహమాన్, రాజేంద్రనగర్‌కు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్ర ముదిరాజ్, మేడ్చల్ అభ్యర్థిగా రాజ్ కమల్‌ను విశారదన్ ప్రకటించారు.కార్యర్యక్రమంలో హైకోర్ట్ అడ్వకేట్ వరి స్వామి కురుమ, తెలంగాణ సామాజిక చైతన్య రాష్ట్ర వ్యవస్థాపక తిరుపతయ్య వంశరాజ్, రిటైర్డ్ డీఎస్‌పీ విజయ్ కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రహమాన్, రాఘవేంద్ర ముదిరాజ్, దుర్గాప్రసాద్, జిల్లా ప్రచార కమిటీ నాయకుడు కార్తీక్, రంగారెడ్డి,వికారాబాద్,మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు రాకేష్, రవీందర్, రాజ్ కమల్ పాల్గొన్నారు. అంతకు ముందు డీఎస్‌పీ నాయకులు ఉప్పల్ నుంచి కొత్తపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించి రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌కు ఘన స్వాగతం పలికారు.